# సాక్షి
## పశ్చిమగోదావరి

సోమవారం । 18 । ఆగస్టు । 2025






### టెంకాయ అ'ధర'హో

కొబ్బరికాయల ధరలు టాపు లేపుతున్నాయి. ఆలయాల వద్ద సైజును బట్టి రూ.25 నుంచి రూ.40కు విక్రయిస్తుండడంతో భక్తులు షాక్ అవుతున్నారు. 8లో



### రేషన్ బియ్యం అక్రమ రవాణా

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు నూజివీడు అడ్డాగా మారింది. రేషన్ మొబైల్ వాహనాలను ఎత్తేసి నెల రోజులు గడిచిందో లేదో రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరందుకుంది. 8లో



### పశ్చిమాన అందాల కోన

పశ్చిమ ఏజెన్సీలో ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. కొండ వాగుల నీటి ప్రవాహాలు, జలపాతాల హోయలు ప్రకృతి ప్రేమికుల హృదయాల్లో చిరు సవ్వడి చేస్తున్నాయి. 8లో

## న్యూస్‌రీల్

### గుగాంపునకు మెర్లిన్ అవార్డు



మెర్లిన్ అవార్డు అందుకుంటున్న ఇంద్రజాలికుడు డాక్టర్ గుగాంపు

పెనుగొండ: అంతర్జాతీయ ఇంద్రజాలికుడు గుగాంపునకు ప్రతిష్టాత్మకమైన అమెరికన్ మెర్లిన్ అవార్డు వరించింది. ఈ మేరకు డాక్టర్ గుగాంపు వివరాలు వెల్లడించారు. అమెరికాలోని లాస్ వెగాస్‌లో ఆగస్టు 7న జరిగిన కార్యక్రమంలో మెర్లిన్ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా దేశ విదేశాల నుంచి ఈ అవార్డుకు 37 మంది అంతర్జాతీయ ఇంద్రజాలికులు ఎంపికయ్యారని తెలిపారు. 2016లో మొదటిసారి ఈ అవార్డు తీసుకున్నట్లు తెలిపారు.

### పింఛన్ల తొలగింపు దారుణం

ఆకివీడు: దివ్యాంగులకు రీ–అసెస్‌మెంట్‌లో కొత్త సదరం ధ్రువపత్రాలు ఇవ్వకుండా పింఛన్లు తొలగించడం దారుణమని వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు అల్లాడి నటరాజు ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సదరం ఇచ్చేంతవరకూ పింఛన్లపై జారీ చేసిన నోటీసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేంతవరకూ పింఛన్లు మంజూరు చేయాలన్నారు.

### నేడు పీజీఆర్ఎస్ రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజులు అధిక వర్షాల నేపథ్యంలో నేడు నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేశామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

### పెదవేగి ఎంఈఓ-1పై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నిబంధనలకు విరుద్ధంగా పెదవేగి మండలం రామచంద్రపురం జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై పెదవేగి పాఠశాలకు పంపిన ఎంఈఓ-1పై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 అకడమిక్ కమిటీ కన్వీనర్ గుగ్గులోతు కృష్ణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ్మోహన్ రావు, మోహన్ రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రామచంద్రపురం పాఠశాలలో 100 మంది విద్యార్థులకు సోషల్ బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు.

### ఐఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలి

ఏలూరు(మెట్రో): రైతులకు ఎరువులు విక్రయించిన తరువాత ఆ వివరాలను ఐఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. ఆదివారం పెదవేగి, కామవరపుకోట మండలాల్లో ఎరువుల షాపులను తనిఖీ చేశారు. డీలర్లు యూరియా, ఇతర ఎరువులను విక్రయించిన తక్షణమే పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

# ముంచుతున్న ముసురు

- ఇప్పటికీ ముంపులోనే 21 వేల ఎకరాలు
- తాజాగా మరోసారి ముసురుతో ఆందోళన
- డ్రెయిన్ల ఆక్రమణలతో ఏటా నష్టపోతున్న రైతులు



ఆచంట మండలం పెనుమంచిలిలో నీట మునుగుతున్న వరినాట్లు

పెనుగొండ : వరుస ముసుర్లు సార్వా సాగును నిండా ముంచుతున్నాయి. గత వారం కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 21 వేల ఎకరాలు ఇంకా వర్షపు నీటి ముంపులోనే ఉన్నాయి. మరోవైపు ఆదివారం తెల్లవారుజాము నుంచి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

భారీ వర్షాలకు పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఇప్పటికే ఎకరాకు రూ.15 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. జిల్లాలో 2.08 లక్షల ఎకరాల్లో సార్వా సాగుకు సన్నద్ధం కాగా, ఇప్పటికి 1.84 ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు. ఆచంట దిగువ, యలమంచిలి, నర్సాపురం మండలాల్లో నాట్లు పూర్తి చేయాల్సి ఉంది. ఈ తరుణంలో ముసుర్లు ప్రారంభం కావడంతో నాట్లు వేయడం మరింత ఆలస్యమవుతోంది. ఇదిలా ఉండగా, వరినాట్లు పూర్తి చేసిన 16 మండలాలకుగాను 164 గ్రామాల్లో సుమారు 21 వేల ఎకరాలు నీటి మునిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

అత్తిలి, పెనుమంట్ర, ఆచంట, పెనుగొండ, పోడూరు, తణుకు, తాడేపల్లిగూడెంలో ముంపు తీవ్రత అధికంగా ఉంది. మురుగు డ్రెయిన్ల ఆక్రమణలతో మురుగు కిందకు ప్రవహించే అవకాశం లేకుండా పోవడంతో రెండు మూడు రోజులుగా ముంపులోనే వరిచేలు ఉన్నాయి. దీంతో నాట్లు కుళ్లిపోయే అవకాశం ఉందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

**ఏటా ముంపే..**

ఈ ఏడాది రైతన్నల దుస్థితి అయోమయంగా మారింది. నిన్న మొన్నటి వరకూ అధిక ఎండ తీవ్రతతో సాగునీటి కొరతను ఎదుర్కొన్నారు. ఒక్కసారిగా వారంలోనే పరిస్థితి తారుమారైంది. సార్వా సాగు ఆదిలోనే ముసుర్లు ముంచుకొచ్చాయి. ఒక్కసారిగా భారీగా కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఏపుగా ఎదిగిన వరిచేలు ముంపునకు గురి కావడంతో ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నాట్లు ముందుగా వేసిన రైతులు మొదటి దఫా ఎరువులు సైతం పూర్తి చేశారు. ముఖ్యంగా జిల్లాలో నక్కల డ్రయిన్, తాడేరు డ్రయిన్, గోస్తనీ నదుల ప్రాంతంలో ఉన్న వరిచేలు ఏటా ముంపునకు గురవుతూ తీవ్ర నష్టాన్ని మిగులుస్తున్నాయి. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడం వలనే మురుగు డ్రెయిన్ల వెంట ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముంపునకు గురైన వరిచేలను గుర్తించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



పెనుమంట్ర మండలం ఎస్.ఇల్లింద్రపర్రు వద్ద చెరువును తలపిస్తున్న వరిచేలు



పెనుగొండ శివారున కొఠాలపర్రు వద్ద వరిచేల దుస్థితి

### కౌలు రైతుకు కన్నీరే



**ముసురుతో వరిచేలు మునగడంతో కౌలు రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాం. రెండు,** మూడు రోజులుగా ముంపులోనే వరి చేలు ఉన్నాయి. ప్రభుత్వం కౌలు రైతును గుర్తించి నష్టపరిహారం అందించాలి.

– రాపాక మోజేస్, కౌలు రైతు, పెనుగొండ

### డ్రెయిన్ల ఆక్రమణలతోనే ముంపు



నక్కల డ్రెయిన్‌లో ఆక్రమణలతో వరిచేలు మునుగుతున్నాయి. నక్కల డ్రెయిన్ ప్రక్షాళన ఇప్పటి వరకూ చేపట్టలేదు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకొన్నా పట్టించుకొన్న నాథుడే కరువయ్యాడు. 15 ఎకరాలు కౌలుకు చేస్తున్నా. పూర్తిగా నక్కల డ్రెయిన్ ముంపులోనే ఉన్నాయి.

– నరసన్న, కౌలు రైతు,పెనుగొండ

### తీవ్రంగా నష్టపోయాం



వరుస ముసుర్లతో వరిచేలన్నీ ముంపునకు గురయ్యాయి. గోస్తనీ నదీ పరివాహక ప్రాంతమంతా నీట మునిగింది. ఏటా ఇదే పరిస్థితి నెలకొంటుంది. నాట్లు వేసిన తరువాత ముంపుతో వరి నాట్లు కుళ్లిపోతున్నాయి. మరోసారి నాటుకోవాల్సి వస్తోంది.

– అంగర నాగరాజు, రైతు, పెనుమంట్ర

## భారీ వర్షాలతో అప్రమత్తం



భీమవరం (ప్రకాశంచౌక్): భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గంటకు 30–40 కి.మీ. వేగంతో తీరం వెంట ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని కలెక్టర్ సూచించారు. గోదావరికి వరద ఉధృతి దృష్ట్యా నదిలోకి వెళ్లవద్దని, ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటివి చేయవద్దన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రాణ, ధన నష్టం జరగకుండా చూడాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అత్యవసర మందులు, క్లోరిన్, బ్లీచింగ్ తదితర సామగ్రితో సిద్ధంగా ఉండాలన్నారు. వ్యవసాయ అధికారులు, ఇరిగేషన్ అధికారులు వర్షాలు తగ్గే వరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో వినియోగం నిమిత్తం మోటార్ బోట్లు, గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. అధికారులంతా ప్రధాన కేంద్రాల్లోనే ఉండాలని, ఎవరికీ సెలవులు లేవని చెప్పారు. కలెక్టరేట్‌లో 08816 299181 నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు.

## పెన్షనర్లపై ప్రభుత్వం చిన్నచూపు

భీమవరం: రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సత్తిరాజు ఆరోపించారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో టి.గంగరాజు అధ్యక్షతన జరిగిన జిల్లా సదస్సులో మాట్లాడుతూ పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రతి సంవత్సరం వడ్డీ కింద రూ.54 వేల కోట్లు వస్తుంటే కేవలం రూ.14 వేల కోట్ల రూపాయలతో పెన్షన్లు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికుల్ని మోసం చేయడమేనని ఆయన వివరించారు. రిటైర్డ్ ఉద్యోగులకు డీఏ ఇతర సౌకర్యాన్ని ఆపాలని నిర్ణయం తీసుకోవడం దారుణమని విమర్శించారు. ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు కనీసం రూ.9000 పెన్షన్ ఉండాలని దేశవ్యాప్తంగా ఆందోళన జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం నీరెత్తినట్టుగా ఉండడం పాలకుల విధానాలను తెలియజేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తూ ఉంటే ఎన్నికల ముందు వాగ్దానాలు చేసిన పాలకులు ఎన్నికల అనంతరం విస్మరించడం తగదని పేర్కొన్నారు. పెన్షనర్స్ సమస్యలపై ఈ నెల 25న కలెక్టరేట్ల వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని, సెప్టెంబర్ 13న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ ఫంక్షన్ హాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.జేమ్స్, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




పెన్షనర్ల సమావేశంలో మాట్లాడుతున్న సత్తిరాజు

### కల్తీపై చర్యలు శూన్యం

ఆకివీడు: పశ్చిమగోదావరి జిల్లా కల్తీ ఖిల్లాగా మారిందని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన నివాసంలో ఆదివారం మాట్లాడుతూ కల్తీ, అక్రమ వ్యాపారాలతో వినియోగదారులు, ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. వినియోగారులకు బిల్లులు ఇవ్వడలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కల్తీని అరికట్టాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తి పడుతున్నారని వాపోయారు. కోట్లాది రూపాయల అక్రమ వ్యాపారంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుందన్నారు. వినియోగదారుల సేవల్లో నిమగ్నమైన వినియోగదారుల సంఘాల్ని జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

### ● బండి కాదు.. మొండి

ఆర్టీసీ బస్సులు ఎక్కడపడితే అక్కడ ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్తున్న ప్యాసింజర్ బస్సు కామవరపుకోట మండలం కొత్తూరు బస్టాండ్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఒక్కసారిగా ఆగిపోయింది. ప్రభుత్వం ఉచిత బస్సు అంటూ కాలం చెల్లిన బస్సులు తిప్పడమేంటని మహిళలు విమర్శిస్తున్నారు. ప్రయాణికులు ఎంత తోసినా బస్సు ముందుకు కదలకపోవడంతో చేసేది లేక, అక్కడే వదిలిపెట్టి, ప్రయాణికులను వేరే బస్సులో పంపించారు.

– కామవరపుకోట



## పెరుగుతున్న గోదావరి ఉధృతి

ఏలూరు(మెట్రో): గోదావరి వరద నేపథ్యంలో ఏలూరు కలెక్టరేట్‌లో 1800-233-1077, 94910 41419 ఫోన్ నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. గోదావరి వరద పెరుగుతున్న దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు నదిలోకి వెళ్లడం గాని, ఈతకు వెళ్లడం గాని, చేపలు పట్టడం గాని చేయవద్దన్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఏలూరు జిల్లాలో ఈనెల 18న ప్రజా ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ కార్యక్రమం రద్దు చేశామని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

**తమ్మిలేరులో పెరుగుతున్న నీటిమట్టం**

చింతలపూడి: జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన తమ్మిలేరు జలాశయంలో నీటిమట్టం పెరుగుతోంది. ఎగువ ప్రాంతమైన తెలంగాణాలో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఏలూరు జిల్లాలో వర్షాలకు తమ్మిలేరుకు వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం ఎగువ ఆంధ్రా కాల్వ ద్వారా గంటకు 579 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. తమ్మిలేరు ప్రాజెక్టులో ప్రస్తుతం 339 అడుగుల మేర నీటి మట్టం ఉందని తమ్మిలేరు ఇరిగేషన్ ఇన్‌చార్జ్ ఏఈ లాజర్ బాబు ఆదివారం తెలిపారు. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 355 అడుగులు. 348 అడుగులకు చేరుకోగానే అధికారులు కాల్వల ద్వారా సాగునీరు విడుదల చేస్తారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3 టీఎంసీలు. ప్రాజెక్టు పూర్తిగా నిండితే పంటలకు ఇబ్బంది ఉండదని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

**ఆందోళన బాటలో భవన నిర్మాణ కార్మికులు**



తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికుల ధర్నా(ఫైల్)

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేశారు. వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామని, కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు తప్పక అందజేస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. అప్పటి నుంచి నేటి వరకు ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పైనే అవుతున్నా, ఎన్నికల హామీలు నేటి వరకు అమలు చేయలేదని, ఇబ్బందులలో ఉన్నామని నిర్మాణ రంగ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 60 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులుండగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 5 లక్షల మంది కార్మికులు ఉన్నారు. వెల్ఫేర్ బోర్డులో సభ్యులుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారుగా 1.20 లక్షల మంది నమోదు చేసుకున్నారు. ఒక వైపు పనులు లేకపోవడం, మరో వైపు నిత్యావసర ధరలు, అన్ని రకాల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ఇప్పటికే కార్మికులు ఆవేదనలో ఉన్నారు. దీంతో చేసేది లేక భవన నిర్మాణ కార్మిక సంఘాలు హక్కుల సాధన కోసం పోరుబాట పట్టాయి. ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని, బోర్డును క్రియాశీలం చేసి పటిష్ట పరచాలని, అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సొమ్మును భవన కార్మికులకు ఖర్చు పెట్టాలని, బోర్డులో నెంబర్లను నియమించాలని కార్మికులు కోరుతున్నారు.

**ఆందోళనలు ఉధృతం**

ఇప్పటికే వార్డు సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, అసిస్టెంట్ లేబర్ కార్యాలయాలు వద్ద, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ధర్నాలు నిర్వహించి అధికారులకు సమస్యలు పరిష్కరించాలని వినతులు ఇచ్చారు. రాష్ట్రంలోని అందరు ఎమ్మెల్యేలకు, వెల్ఫేర్ బోర్డు చైర్మన్‌కు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విన్నవించారు. పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. త్వరలో సమస్యల పరిష్కారం చూపుతామని అంటున్నారు తప్ప సమస్యలు తీర్చే పరిస్థితి కానరావడం లేదని నిర్మాణ రంగ కార్మికులు వాపోతున్నారు.

**కార్మికుల డిమాండ్లు**

- భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును క్రియాశీలం చేసి పటిష్ట పరచాలి.
- బోర్డులో కార్మికుల నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు వార్డు, గ్రామ సచివాలయంలో నమోదు చేయడానికి అవకాశం కల్పించాలి.
- పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ పరిష్కరించాలి, వెల్ఫేరు బోర్డులో నమోదైన కార్మికులకు వెంటనే గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి
- వయోభారం లేదా అనారోగ్యం కారణంగా పని నుంచి విరమించుకున్న కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా పెన్షన్ మంజూరు చేయాలి
- ప్రమాదాలు వల్ల అనారోగ్యం వల్ల మంచాన పడిన కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా ఈఎస్ఐ తరహాలో ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలి.
- భవన నిర్మాణ కార్మికులకు ఐదు రోజులు ఆసుపత్రిలో ఉండాలనే నిబంధన తొలగించాలి.

### బోర్డును వెంటనే ప్రారంభించాలి



భవన నిర్మాణ కార్మికులకు అందించే ఏకైక విభాగం వెల్ఫేర్ బోర్డు. బోర్డు ప్రస్తుతం అందుబాటులో లేదు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్ క్లెయిములు పరిష్కారం చేస్తామని చెప్పారు. బోర్డును తక్షణమే పునఃప్రారంభించాలి. వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.

– మైలవరపు శ్రీరాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం

### ఆందోళనలు ఉధృతం చేస్తాం



భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం అందించాల్సిన సంక్షేమ పథకాలు నిలిచిపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికి, భద్రతకు, బీమాకు ఖర్చుచేయాలి. చేతినిండా పనులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. సంక్షేమాలు అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తాం.

– సింగవరపు సునీల్, ప్రధాన కార్యదర్శి నవాబుపాలెం భవన నిర్మాణ కార్మిక సంఘం

# ఆక్వాకు వాయు'గండం'

**ఆక్సిజన్ అందక చేపలు, రొయ్యలు ఉక్కిరిబిక్కిరి**

గణపవరం: వాతావరణంలో తీవ్రమైన మార్పులు ఆక్వా సాగుకు గండంగా మారాయి. భారీవర్షాలు, చల్లబడిన వాతావరణం ఆక్వా సాగుకు ప్రతికూలంగా మారింది. ట్రంప్ సుంకాల దెబ్బతో విలవిల్లాడుతున్న రొయ్య రైతులు ప్రస్తుత వాతావరణ మార్పులతో బెంబేలెత్తిపోతున్నారు. వేసవిలో ఆదుకోవాల్సిన రొయ్యసాగు రైతును కుదేలు చేసింది. ఎడాపెడా తెగుళ్లు ఆశించడంతో రొయ్యల చెరువులు ఖాళీ అయ్యాయి. మరోవైపు చేప ధర తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇటీవల రొయ్యల ధర ట్రంప్ సుంకాల పెంపుతో పతనమయ్యాయి. చేప ధర కూడా కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకూ పడిపోయింది. రెండు నెలలుగా వాతావరణం ఆక్వా సాగుకు ఏమాత్రం కలిసి రావడం లేదు. మే నెలలో అకాల వర్షాలతో పూర్తిగా చల్లబడగా, జూన్‌లో వాతావరణం వేసవిని తలపించింది. జూలైలో కూడా రెండు వారాల పాటు విపరీతమైన ఎండలు, ఉక్కబోతతో వేసవిని మించిన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వారం రోజులుగా వాతావరణం చల్లబడింది. పూటకో రకంగా మారుతున్న వాతావరణం వల్ల ఆక్సిజన్ సమస్య తలెత్తుతుంది. చేపలు, రొయ్యలకు సరిపడ ఆక్సిజన్ అందకపోవడంతో నీటి ఉపరితలంపై తిరుగాడుతూ నీరసించిపోతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి రైతులు నిరంతరం ఏరియేటర్లు తిప్పుతున్నారు.

**తెగుళ్ల బారిన చేపలు, రొయ్యలు**

చెరువులలో ఆక్సిజన్ లోటు పూడ్చడానికి రసాయనాలు చల్లుతున్నారు. రెండు రోజులుగా వాతావరణం పూర్తిగా చల్లబడి, ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయి చేపలు, రొయ్యలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. దీంతో మేతలు సరిగా తినలేక నీరసించి పోతుండటంతో రైతులు చేపలు, రొయ్యలు అర్ధంతరంగా పట్టేసి అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1.25 లక్షల ఎకరాలలో రొయ్య, మరో 1.50 లక్షల ఎకరాలలో చేపల సాగు జరుగుతుంది. వాతావరణం ప్రతికూలంగా మారడంతో రొయ్యలకు వైరస్ వ్యాధులు, చేపలకు మొప్పతెగులు వంటివి సోకుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుత పరిస్థితిలో రొయ్య రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.



రొయ్యల చెర్వులో తిరుగుతున్న ఏరియేటర్లు



కౌంట్‌కు రాకుండానే పట్టేసిన రొయ్యలు

## క్లుప్తంగా

### శ్రీవారి క్షేత్రం.. భక్త జనసంద్రం


శ్రీవారి దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

**ద్వారకాతిరుమల:** శ్రీవారి భక్తులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆదివారం పెద్దఎత్తున ఆలయానికి వచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు భక్తజనంతో కళకళలాడాయి. దర్శనం క్యూలైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, అనివేటి మండపం, కల్యాణ కట్ట ఇలా అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. వరుస సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో వేలాదిగా భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు.

### జై వనరూపిణి.. విజయకారిణి


గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

**బుట్టాయగూడెం:** మండలంలోని మారుమూల గ్రామమైన కాపవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాల్లో తరలివచ్చి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఉదయం నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు వర్షంలోనే తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆలయ కమిటీ వారు, పోలీసులు ప్రత్యేక చర్యలు చేట్టారు.

### పెద్దింట్లమ్మను దర్శించుకున్న భక్తులు


పెద్దింట్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు

**కై కలూరు:** కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారిని భక్తులు ఆదివారం భారీఎత్తున దర్శించుకున్నారు. శ్రావణమాసం కావడంతో అనేకమంది భక్తులు వివిధప్రాంతాల నుంచి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణాజిల్లాకు చెందిన అనేక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఈ సందర్భంగా లడ్డూ ప్రసాదం, రూమ్‌ల అద్దె, ఇతర మార్గాల ద్వారా ఆలయానికి రూ.40,405 ఆదాయం సమకూరినట్లు కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు.

# టెంకాయ అ'ధర'హో

- టాపు లేపుతున్న కొబ్బరికాయ ధర
- సైజును బట్టి రూ.25 నుంచి రూ.40 వరకు విక్రయాలు


శ్రీవారి ఆలయం వద్ద కొబ్బరి కాయ కొనుగోలు చేస్తున్న భక్తురాలు


శ్రీవారి ఆలయంలో కొబ్బరి కాయలు కొడుతున్న భక్తులు

**ద్వారకాతిరుమల:** కొబ్బరికాయల ధరలు టాపు లేపుతున్నాయి. ఆలయాల వద్ద సైజును బట్టి రూ.25 నుంచి రూ.40కు విక్రయిస్తుండడంతో భక్తులు షాక్ అవుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని నిత్యం వేలాది మంది భక్తులు దర్శిస్తారు. అందులో అధిక శాతం మంది భక్తులు ఆలయంలో కొబ్బరికాయలు కొడతారు. అయితే కొబ్బరి కాయల ఉత్పత్తి తగ్గడంతో గత మూడు నెలల క్రితం వాటి ధరలు రెట్టింపయ్యాయి. ప్రస్తుత శ్రావణమాసంలో వివాహాది శుభకార్యాలు జరుపుకునేవారు, ఆలయాల్లో మొక్కులు తీర్చుకునే సాధారణ భక్తులు కొబ్బరికాయలు కొనేందుకు ఇబ్బంది పడుతున్నారు. ధరలు పెరగక ముందు వ్యాపారులు దళారుల వద్ద రూ.10 లకు కొన్న కొబ్బరి కాయను రూ.15కు, రూ.15 కాయను రూ.20 నుంచి రూ.25కు విక్రయించేవారు. ప్రస్తుతం దళారుల వద్ద రూ.20కు కొన్న కాయను రూ.25కు, రూ.25 కాయను రూ.30 నుంచి రూ.40కు అమ్ముతున్నారు. దాదాపు అన్ని ఆలయాల వద్ద ఇదే పరిస్థితి ఉంది.

**నెలకు 50 వేలకు పైగా విక్రయాలు**

శ్రీవారి క్షేత్రంలో చిన్నాపెద్దా మొత్తం 15 వరకు కొబ్బరికాయల దుకాణాలు ఉన్నాయి. వాటి ద్వారా వ్యాపారులు నెలకు 50 వేలకు పైగా కొబ్బరి కాయలు విక్రయిస్తారు. అయితే కొబ్బరికాయలు ధరలు బాగా పెరగడంతో గత మూడు నెలల నుంచి విక్రయాలు బాగా తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం శ్రావణమాసం కావడంతో అవసరమైన వారు తప్పక కొబ్బరికాయలు కొంటున్నారు. కొందరు భక్తులైతే కొబ్బరికాయలు కొనకుండా ఆ డబ్బులను స్వామివారి హుండీల్లో వేసి దండం పెట్టుకుంటున్నారు.

**ఎండు కొబ్బరి, నూనె ధరలకు రెక్కలు**

కొబ్బరి కాయల ధరలు పెరగడంతో ఎండు కొబ్బరి, నూనె ధరలు సైతం అమాంతం పెరిగాయి. గత మూడు నెలల క్రితం కిలో ఎండు కొబ్బరి రూ.240 పలికితే, ప్రస్తుత మార్కెట్లో రెట్టింపై రూ.400కు చేరింది. కిలో కొబ్బరి నూనె గతంలో రూ.360 కాగా, ప్రస్తుత మార్కెట్లో రూ.500 పలుకుతుండటం విశేషం. కొబ్బరికాయల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

### ధరలను నియంత్రించాలి



శ్రీవారికి మొక్కు చెల్లించేందుకు క్షేత్రానికి వచ్చాను. కొండ కింద చిన్న కొబ్బరికాయను రూ.25కు కొన్నాను. ఆలయం వద్ద ఉన్న దుకాణంలో అడిగితే రూ.30, పెద్ద కాయ రూ.40 చెప్పారు. శివాలయం వద్ద షాపులో రూ.40కు అమ్ముతున్నారు. ఇదేంటని వ్యాపారులను అడిగితే మార్కెట్‌లో కొబ్బరికాయల ధరలు పెరిగాయని అంటున్నారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– తమ్మిరెడ్డి కృష్ణ, భక్తుడు, కైకలూరు

### విక్రయాలు తగ్గాయి



దళారుల వద్ద మేము చిన్నకాయను రూ.20కు కొంటున్నాము. వాటిని అమ్మడం చాలా కష్టంగా ఉంది. సామాన్య భక్తులు అంత ధర పెట్టి కొనడానికి ఇష్టపడటం లేదు. మొక్కులు తీర్చేవారు మాత్రమే కొబ్బరి కాయలు కొంటున్నారు. పెద్ద కాయ రూ.30 చెబుతుంటే వారు హడలిపోతున్నారు. విపరీతంగా పెరిగిన ధరల వల్ల విక్రయాలు బాగా తగ్గాయి.

– యండపల్లి వీరయ్య, కొబ్బరికాయల వ్యాపారి, ద్వారకాతిరుమల

### ఎరువుల షాపుల్లో తనిఖీలు


కామవరపుకోటలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

**కామవరపుకోట:** వ్యవసాయ శాఖ జిల్లా అధికారి షేక్ హబీబ్ బాషా కామవరపుకోట మండలంలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో ఎరువుల నిల్వల్లో తేడాలున్నట్లు గుర్తించారు. కామవరపుకోటలోని కొండూరు రామ్మోహనరావు ఎరువుల దుకాణం వద్ద రూ.2,56,471 విలువచేసే 5 టన్నుల ఎరువులు, కొండూరు నాగేశ్వరరావు ఎరువుల షాపు వద్ద రూ.3,73,168 విలువచేసే 26.850 టన్నులు, శ్రీ సూర్య ఆగ్రోస్ షాప్‌లో రూ.20 వేలు విలువ చేసే 2 టన్నుల ఎరువుల నిల్వల్లో వ్యత్యాసాలు ఉండడంతో వాటి విక్రయాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా 98 మెట్రిక్ టన్నులు, సొసైటీల వద్ద 37.5 టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, కావలసిన రైతులు అవసరం మేరకు వ్యవసాయంలో వినియోగించుకోవాలన్నారు. డీలర్లు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చింతలపూడి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వై. సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు పాల్గొన్నారు.

# జోరుగా రేషన్ బియ్యం అక్రమ రవాణా

దందాకు అడ్డాగా మారిన నూజివీడు


నూజివీడులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సివిల్ సప్లయ్స్ డీటీ, విజిలెన్స్ అధికారులు (ఫైల్)

**నూజివీడు:** రేషన్ బియ్యం అక్రమ రవాణాకు నూజివీడు అడ్డాగా మారింది. రేషన్ మొబైల్ వాహనాలను ఎత్తేసి నెల రోజులు గడిచిందో లేదో రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరందుకుంది. మొబైల్ వాహనాల వల్ల రేషన్ బియ్యం అక్రమ రవాణా పెరిగిందని సాకు చూపిస్తూ వాటిని రద్దు చేసిన ప్రభుత్వం ప్రస్తుతం జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నోరు మెదపడం లేదు. నూజివీడు ప్రాంతంలో గత నెలరోజుల వ్యవధిలోనే అక్రమంగా తరలిస్తున్న 118 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నూజివీడు, ముసునూరు మండలంలో పట్టుకోవడం సంచలనంగా మారింది. జూలై 3వ తేదీన నూజివీడు బైపాస్ రోడ్డులో తరలిస్తున్న 51 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, 5న నూజివీడు మండలం మొర్సపూడిలో 26 క్వింటాళ్లు, ఆగస్టు 7న ముసునూరు మండలం గుళ్లపూడిలో రేషన్ బియ్యంను అక్రమ రవాణా చేస్తుంటే విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. దీంతో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం ఎంత పెద్ద ఎత్తున జరుగుతుందో తెలుస్తోంది. పట్టణానికి చెందిన కొందరు వ్యాపారులు, మండలంలోని బత్తులవారిగూడెంకు చెందిన ప్రజాప్రతినిధి భర్త, టీడీపీకి చెందిన కార్యకర్త పెద్ద ఎత్తున బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్నాడు. అలాగే ఆగిరిపల్లికి చెందిన అధికార పార్టీకి చెందిన ఒక రేషన్ డీలరే యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణాను నిర్వహిస్తున్నాడు. అధికార పార్టీకి చెందిన వీరందరూ తమకు అడ్డుకునే వారెవరూ ఉండరనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. తమ అక్రమ వ్యాపారాన్ని మూడు లారీలు.. ఆరు ఆటోలుగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ప్రతి నెలా పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని వీరు కొందరు ఏజంట్ల ద్వారా సేకరించి తమ అడ్డాకు చేర్చుకొని అక్కడ నుంచి లోడులు ఎత్తుతున్నారు.

**కార్డుదారుల వద్ద రూ.10కు కొనుగోలు చేస్తున్న రేషన్ డీలర్లు**

డీలర్లు కార్డుదారుల వద్ద నుంచి రేషన్ బియ్యాన్ని కిలో రూ.10కు కొనుగోలు చేస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా లాభాలు ఎక్కువగా ఉండటంతో కొందరు డీలర్లు ఏకంగా కార్డుదారుడి వద్దకే వెళ్లి బయోమెట్రిక్ వేయించుకొని కిలోకు రూ.10 చొప్పున చెల్లించి వెళ్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని డీలర్ల వద్ద నుంచి అక్రమ రేషన్ బియ్యం వ్యాపారులు కిలో రూ.17కు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఇక్కడ డీలర్‌కు కిలోకు రూ.7 లాభం వస్తోంది. డీలర్ల వద్ద కొనుగోలు చేసిన బియ్యాన్ని అక్రమార్కులు కాకినాడ పోర్టుకు తరలించే మరొక పెద్ద వ్యాపారికి కిలో రూ.25 నుంచి రూ.27కు విక్రయించి కిలోకు రూ.7 నుంచి రూ.10 కు సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో పట్టుబడి కేసులు పెట్టినా అక్రమ రేషన్ బియ్యం వ్యాపారాన్ని మానకుండా మళ్లీ అదే దందా నడుపుతున్నారు. బియ్యం దందాను అడ్డుకోవాల్సిన అధికారులు మొక్కుబడిగా 6ఏ కేసు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో బియ్యం మాఫియా యథేచ్ఛగా అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

## రన్నరప్‌గా బాలుర బాస్కెట్‌బాల్ జట్టు

క్వార్టర్ ఫైనల్‌లో ఓడిన బాలికల జట్టు


రన్నరప్‌గా నిలిచిన ఉమ్మడి పశ్చిమ బాలుర జట్టు

**ఏలూరు రూరల్:** రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలుర జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. ఈ నెల 14వ తేదీ నుంచి 17 వరకూ పిఠాపురంలో ఓటీసీ హైస్కూల్ గ్రౌండ్‌లో 10వ రాష్ట్రస్థాయి బాలబాలికల జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. లీగ్ దశలో జిల్లా బాలురు జట్టు శ్రీకాకుళం జట్టుపై 25–08, విజయనగరంపై 31–11, కర్నూల్‌పై 58–45, గుంటూరుపై 47–31 స్కోర్ తేడాతో గెలిచి సెమీఫైనల్‌కు చేరింది. ఆదివారం వర్షం కురవడంతో మ్యాచ్‌లు జరగలేదు. దీంతో నిర్వాహకులు పూర్తిస్థాయి మ్యాచ్‌కు బదులుగా 5 ఫ్రీ త్రో బాస్కెట్స్ నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఇందులో జిల్లా బాలుర జట్టు సెమీఫైనల్‌లో కృష్ణ జట్టుతో తలపడి 3-2 స్కోర్‌తో గెలిచింది. తర్వాత ఫైనల్‌లో అనంతపురం జట్టు చేతిలో 3-4 స్కోర్‌తో ఓటమి పాలై రన్నరప్‌గా నిలిచింది. అసోసియేషన్ సభ్యులు కృష్ణారెడ్డి, గవ్వ శ్రీనివాసరావు, కె మురళీకృష్ణ జట్టును అభినందించారు. బాలికల జట్టు లీగ్ దశలో ప్రకాశంపై 32-02, చిత్తూరుపై 39-13 స్కోర్‌తో గెలిచి, క్వార్టర్‌ఫైనల్‌లో విశాఖ జట్టు చేతిలో 57-48 స్కోర్‌తో ఓడి తిరుగుముఖం పట్టింది.

### ముంపు మండలాల ప్రయాణికులకు స్త్రీ శక్తి పథకం వర్తింపు

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** జంగారెడ్డిగూడెం డిపో పరిధిలోని పోలవరం ముంపు మండలాల ప్రయాణికులకు స్త్రీ శక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి తగినట్టుగా సర్వీసులను మార్పు చేసినట్టు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షబ్నం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం-రాజమండ్రి, భద్రాచలం-రేపాకగొమ్ము సర్వీసులు ఎటపాక వరకు పొడిగించామన్నారు. భద్రాచలానికి వెళ్లే ఈ రెండు సర్వీసులను ఆంధ్రప్రదేశ్‌లోని ఎటపాక వరకు పొడిగిస్తూ ఈ రూట్‌ను ఎనక్లేవ్ రూట్లుగా మార్చడం ద్వారా సదరు సర్వీస్ మార్గంలోని కుక్కునూరు, వేలేరుపాడు (విలీన మండలాలు) మండలాల గ్రామాల ప్రయాణికులకు స్త్రీ శక్తి పథకం పరిధిలోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. అశ్వారావుపేట షటిల్ సర్వీసును జంగారెడ్డిగూడెం – జీలుగుమిల్లి సర్వీస్‌గా మార్పు చేయడం ద్వారా ఈ మార్గంలో గల గ్రామ ప్రయాణికులను స్త్రీ శక్తి పథకం పరిధిలోకి తీసుకువచ్చామన్నారు.

## అంగన్‌వాడీల సంఘ జిల్లా కమిటీ ఎన్నిక

**జంగారెడ్డిగూడెం:** ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా నూతన అధ్యక్షులుగా పి.భారతి, కార్యదర్శిగా టీ మాణిక్యం ఎన్నికయ్యారు. శనివారం జంగారెడ్డిగూడెంలో జరిగిన యూనియన్ 9వ జిల్లా మహాసభల్లో నూతన కమిటీని ఎనుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా డీఎన్‌వీడీ ప్రసాద్, కోశాధికారిగా ఎం.తులసి, ఉపాధ్యక్షులుగా పి.సుజాత, టి.రజిని, పి.రాజకుమారి, బీజేఎన్ కుమారి, జి.విమల, వి.స్వర్ణకుమారి, భార్గవి, చెల్లెమ్మ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా కె.పుష్ప, ఎస్.లత, జి.సరళ, షమీమా, సీహెచ్ ఇందిర (మినీ), మహిమ(హెల్పర్), వెన్నెల(హెల్పర్) ఎన్నికయ్యారు. మహాసభల్లో అంగన్‌వాడీలకు చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ వెంటనే జీవో జారీ చేయాలని, సెంటర్ అద్దెల బకాయిలు, కరెంట్ చార్జీలు వెంటనే చెల్లించాలని, ఎఫ్ఆర్ఎస్, యాప్‌ల పేరుతో వేధింపులు ఆపాలని, స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ తీర్మానించారు.

# పశ్చిమాన అందాల కోన

**బుట్టాయగూడెం:** పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో అటవీ ప్రకృతి అందాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి. అరకు అందాలకు ఏ మాత్రం తీసిపోకుండా ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. చెట్ల లేలేత పచ్చదనం.. పక్షుల కిలకిలరావాలు ఇక్కడ నిత్యం వసంతాన్ని తలపిస్తాయి. కొండ వాగుల నీటి ప్రవాహాలు, ప్రకృతి వడిలో జలపాతాల హోయలు ప్రకృతి ప్రేమికుల హృదయాల్లో చిరుసవ్వడి చేస్తాయి. బుట్టాయగూడెం మండంలోని పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లి, గిన్నెపల్లి, గడ్డపల్లి, దారావాడ, చిలకలూరు మారుమూల అటవీ ప్రాంతంలో గల గ్రామాలు, ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణంలో ప్రకృతి అందాలు ఎంతో కనువిందు చేస్తాయి. ప్రస్తుతం ఈ గ్రామాలకు సరైన రహదారి లేదు. ద్విచక్రవాహనాలు మాత్రం ప్రయాణించే సమయంలో రోడ్డుకు ఇరువైపులా పొడవైన పచ్చని చెట్లు, ఎత్తయిన కొండలు మైమరపింపజేస్తాయి. దట్టమైన అటవీప్రాంతంలో సెలయేర్లు, కనువిందుచేసే వాగులు, ఆహ్లాదాన్ని పంచే జలపాతాలు అణువణువు అందం తొణికిసలాడుతుంది. అలాగే గుబ్బల మంగమ్మ గుడి దర్శనం కూడా ఎంతో అనుభూతిని కలిగిస్తుంది. ఈ ప్రాంతాలను అభివృద్ధి చేస్తే అరకు అందాలకు ఏ మాత్రం తీసిపోదు.


చూపరులను కనువిందు చేస్తున్న ఎత్తయిన కొండలు


వర్షాలకు పచ్చబడిన ముంజులూరు అటవీ ప్రాంతం


ముంజులూరు సమీపంలో ఉన్న ఏనుగుతోగు జలపాతం


ఉప్పరిల్ల వద్ద ప్రవహిస్తున్న వాగు


గోగుమిల్లి సమీపంలో కొండవాగు రాళ్ల మధ్య నీరు ప్రవహిస్తున్న దృశ్యం

### రోడ్డు ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ మృతి


ప్రమాదానికి గురైన కొబ్బరికాయల లోడు లారీ

**కొయ్యలగూడెం:** కొయ్యలగూడెం- జంగారెడ్డిగూడెం జాతీయ ప్రధాన రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్, క్లీనర్ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పాలకొల్లు నుంచి తెలంగాణ రాష్ట్రం బైసంకి వెళుతుండగా పవర్ గ్రిడ్ వద్దకు వచ్చేసరికి కొబ్బరికాయల లోడు ఒక వైపునకు ఒరిగింది. దీంతో డ్రైవర్ నవ్వుంద్రి రాజేష్ (30), తొడదాసి లక్ష్మణరావు (35) లారీని రోడ్డు మార్జిన్ వైపునకు ఆపి లోడును సరి చేస్తుండగా కలకత్తా నుంచి హైదరాబాదు వెళుతున్న మరో లారీ మితిమీరిన వేగంతో వచ్చి ఢీకొట్టింది. దీంతో డ్రైవర్, క్లీనర్‌ల మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఛిద్రం అయ్యాయి. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వి చంద్రశేఖర్ తెలిపారు.

### మహిళకు తీవ్రగాయాలు

**దెందులూరు:** ద్విచక్రవాహనంపై వెళుతుండగా ప్రమాదవశాత్తూ ఓ మహిళ జారి పడిపోవడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం ఆదివారం ద్విచక్రవాహనంపై ఏలూరు వైపు భార్యభర్తలు వెళుతుండగా జాతీయ రహదారిపై కొవ్వలి వద్దకు వచ్చేసరికి ద్విచక్రవాహనం నుంచి మహిళ ప్రమాదవశాత్తూ పడిపోవడంతో గాయాలపాలైంది. అంబులెన్స్‌కు ఫోన్ చేసినా సకాలంలో రాకపోవడంతో వారిని ఆశ్రమ వైద్యశాలకు తరలించి వైద్య సేవలు అందించినట్లు దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు.

### గోదావరిలో యువకుడి గల్లంతు!

**యలమంచిలి:** అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామానికి చెందిన గోకవరపు కృష్ణ (32) అదృశ్యంపై అతని సోదరుడు నాగ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శాంసన్‌రాజు తెలిపారు. కృష్ణ ఒక ప్రైవేట్ కంపెనీలో చిరుద్యోగి. కృష్ణాష్టమి పండుగ సందర్భంగా శనివారం రాత్రి ఉట్టి వేడుక చూడడానికి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. రాత్రి ఇంటికి వెళ్లకపోవడంతో సోమవారం ఉదయం నుంచి గాలిస్తుండగా కృష్ణ బైక్, చెప్పులు చించినాడ వంతెనపై కనిపించాయి. దీంతో అతడి అన్న నాగ ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి కృష్ణ కోసం గోదావరిలో గాలిస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శాంసన్‌రాజు తెలిపారు.

# కాలుష్య కోరల్లో పంట కాలువ

- పంచాయతీ మురుగునీరు అవుట్‌లెట్లు కాలువలోకే
- వర్తక దుకాణాల చెత్తతో డంపింగ్‌యార్డును తలపిస్తున్న కాలువ

**అత్తిలి:** ప్రజల బాధ్యతారాహిత్యం, అధికారుల అలసత్వంతో మండల ప్రజలకు సాగు, తాగునీరు అందించే అత్తిలి కాలువ కాలుష్యపు కోరల్లో చిక్కుకుంది. ఒకప్పుడు అత్తిలి కాలువ నీటిని ఫిల్టర్ చేయకుండానే తాగునీరుగా ఉపయోగించేవారు. నేడు ఈ కాలువ నీటిలో దిగి స్నానాలు చేయడానికి కూడా ప్రజలు భయపడుతున్నారంటే ఏ మేర కాలువ నీరు కలుషితం అయ్యిందో అర్థం చేసుకోవచ్చు. గోదావరి జలాలు అత్తిలి కాలువ ద్వారా మండలంలోని 18 గ్రామాలకు తాగునీటితో పాటు సాగునీటి అవసరాలను తీరుస్తుంది. అత్తిలి ప్రధాన కాలువ నుంచి రేలంగి, ఉరదాళ్లపాలెం, తిరుపతిపురం, కేఎస్ గట్టు, పాలూరు, మంచిలి బ్రాంచి కెనాల్స్ ద్వారా ఆయా గ్రామాలకు తాగు, సాగు నీరు సరఫరా అవుతుంది. అత్తిలి మండలంలో 14 వేల ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు విస్తరించి ఉంది. అత్తిలి కాలువ నుంచి సరఫరా అయ్యే నీటినే సాగు నీటి అవసరాలకు వినియోగిస్తుంటారు. అదే విధంగా గ్రామాల్లో పంచాయతీల వారు కాలువ నీటిని చెరువుల్లో నింపి ఫిల్టర్ చేసి కుళాయిల ద్వారా ప్రజలకు తాగు నీటిని సరఫరా చేసినా ఈ నీటికి కేవలం గృహావసరాలకు మాత్రమే వినియోగిస్తుంటారు. ప్రస్తుతం అత్తిలి కాలువ మురుగు డ్రెయిన్‌ను తలపిస్తోంది.

**మురుగునీటి అవుట్‌లెట్లు కాలువలోకే..**

అత్తిలి గ్రామంలో కాలువ వెంబడి పలు వ్యాపార దుకాణాల నుంచి మురుగు నీటి గొట్టాలను కాలువలోకి పెట్టడంతో కాలువ నీరు కలుషితమౌతోంది. దీనికి తోడు అత్తిలి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామంలో మురుగునీరు డ్రెయిన్ అవుట్‌లెట్ ద్వారా కాలువలోకి కలుస్తోంది. కాలువ గట్టు వెంబడి ఉన్న నివాస గృహాల వారు మురుగునీటి గొట్టాలను కాలువలోకి డైరెక్ట్‌గా కలపడంతో సెప్టిక్ ట్యాంకు నుంచి వచ్చే నీరు కాలువలోకి చేరుతుంది. మండలంలోని ఆరవల్లిలో హరిజనపేటలో ఏర్పాటు చేసిన మురుగునీటి డ్రెయిన్ అవుట్‌లెట్‌ను పంచాయతీ అధికారులు రేలంగి పంట కాలువలోకి పెట్టారు. దీంతో గృహాల నుంచి వచ్చే మురుగు నీటితో పాటు పలువురు మరుగుదొడ్ల నుంచి వేస్ట్ వాటర్‌ను గొట్టాల ద్వారా డ్రెయిన్‌లోకి వదులుతున్నారు. అత్తిలి కాలువ ద్వారా గ్రామాలకు సరఫరా అయ్యే ఈ నీటిని తాగితే వ్యాధుల బారిన పడటం తథ్యం. అత్తిలి ప్రధాన కాలువ నుంచి బ్రాంచ్ కాలువల ద్వారా గ్రామాల్లో పంచాయతీ చెరువులకు తాగునీరు సరఫరా అవుతుంది.

**తాగునీటి అవసరాలకు పనికిరాని కలుషితపు నీరు**

అయితే బ్రాంచ్ కాలువలపై ఉన్న పలు స్లూయిజ్‌ల వద్ద చెత్త, జంతు కళేబరాలు, వ్యర్థ పదార్థాలు నిలిచి ఉండటంతో తీవ్ర దుర్గంధభరిత, కలుషితమైన ఈ నీటిని పంచాయతీ అధికారులు చెరువుల్లో నింపి ఫిల్టర్ చేసి కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఫిల్టర్ చేసినా పూర్తి స్థాయిలో స్వచ్ఛత లేకపోవడంతో కలుషితమైన ఈ నీటిని అధిక శాతం మంది ప్రజలు కేవలం వంటింటి అవసరాలకు మాత్రమే వినియోగిస్తుంటారు. పంచాయతీ సరఫరా చేసిన నీటిని తాగితే నీటి సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉండటంతో తాగు నీటి కోసం గ్రామాల్లో ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల నుంచి టిన్నుల ద్వారా డబ్బులు పెట్టి నీటిని కొనుగోలు చేసి తాగునీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. ముఖ్యంగా అత్తిలి కాలువ శివారు ప్రాంతాలైన పాలూరు, కొమ్మర, ఈడూరు, మంచిలి, కంచుమర్రు, లక్ష్మీనారాయణపురం, ఉనికిలి గ్రామాల పరిధిలో ప్రవహించే బ్రాంచ్ కాలువలు కాలుష్యకోరల్లో చిక్కుకున్నాయి. ఇరిగేషన్,పంచాయతీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి కాలువ నీటిని కాలుష్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అత్తిలి పంచాయతీ కార్యాలయం సమీపంలో కాలువలో కలుస్తున్న మురుగునీరు


అత్తిలిలో గృహాల నుంచి కాలువలోకి ఏర్పాటు చేసిన గొట్టాల ద్వారా వస్తున్న మురుగు నీరు


మురుగు కాలువను తలపిస్తున్న అత్తిలి పంట కాలువ

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



సాగు, తాగునీటి అవసరాలను తీర్చే అత్తిలి కాలువను కలుషితం చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. కాలువ వెంబడి ఉన్న వర్తక దుకాణాల వారు చెత్తను కాలువలో పడేయడంతో పాటు మురుగు నీటి గొట్టాలను కాలువలో పెట్టడంతో పంట కాలువ మురుగు డ్రెయిన్‌గా మారింది. ఇరిగేషన్, పంచాయతీ అధికారులు కాలువ వెంబడి ఉన్న మురుగు డ్రెయిన్ గొట్టాలను నిరోధించి, జల కాలుష్యం నుంచి అత్తిలి కాలువను కాపాడాలి.

–కంకటాల సతీష్, అత్తిలి

## ఇంటికే ఉచిత వైద్యం


వృద్ధులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ హుస్సేన్

**తణుకు అర్బన్:** సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటికీ ఉచిత వైద్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకు, పాతవూరు ప్రాంతాల్లో ఇంటికే పరిమితమైన వృద్ధులకు వైద్య సేవలందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ప్రత్యేక వాహనంలో ఆరుగురు వృద్ధుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. అసోసియేషన్ సభ్యులు యడ్లపల్లి శివప్రసాద్ ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు, నర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ మహా సభలను జయప్రదం చేయండి

**తాడేపల్లిగూడెం రూరల్:** సీఐటీయు మండల రెండో మహాసభలు ఈ నెల 24న తాడేపల్లిగూడెం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహిస్తామని జయప్రదం చేయాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు, కార్యదర్శి ఆమంచి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లిగూడెం పట్టణంలోని సుందరయ్య భవనంలో సీఐటీయు మండల కమిటీ సమావేశం నాగమణి అధ్యక్షతన నిర్వహించారు.

## క్లుప్తంగా

### వలవల శ్రీరామమూర్తికి ఘన నివాళి


శ్రీరామమూర్తి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

**తణుకు అర్బన్:** పేదల రాజ్య స్థాపన కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి కామ్రేడ్ వలవల శ్రీరామమూర్తి అని సీపీఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. ఆదివారం స్థానిక అమర వీరుల భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ వలవల శ్రీరామమూర్తి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయ జీవితం ద్వారా ఎంతో మందిని విద్యాధికులుగా తయారు చేశారని అన్నారు. శ్రీ రామమూర్తి తన పార్థివ దేహాన్ని ఆయన కుటుంబ సభ్యులు, వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం ఆశ్రమ హాస్పిటల్‌కు ఇచ్చారని గుర్తు చేశారు. ముందుగా శ్రీ రామమూర్తి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కామన మునిస్వామి, పి.దక్షిణామూర్తి, పీఎల్ నర్సింహారావు, అంబటి రామకృష్ణ, ఎం.గంగాధర్ రెడ్డి, ఉషా తదితరులు పాల్గొన్నారు.

### రెయిన్ కోట్ల అందజేత


రెయిన్ కోట్లు అందించిన మానవత సంస్థ ప్రతినిధులు

**తణుకు అర్బన్:** తణుకు మానవత శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర విస్తరణ, అభివృద్ధి కమిటీ కన్వీనర్ కె.రాధాపుష్పావతి ఆర్థిక సౌజన్యంతో రూ.8 వేల విలువైన రెయిన్ కోట్లను తణుకులో పలు వృత్తుల్లో ఉపాధి పొందుతున్న వారికి అందజేశారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాధా పుష్పావతి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మానవత అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని, దాతలు సైతం సేవా కార్యక్రమాల నిర్వహణకు విరాళాల రూపంలో మంచి ప్రోత్సాహం అందిస్తున్నారని స్పష్టం చేశారు. డాక్టర్ పీఎస్ఎస్ కిరణ్ ఫౌండేషన్ చైర్మన్ బొల్లా సతీష్‌కుమార్ మాట్లాడుతూ మానవత సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని, వర్షా కాలంలో పలు వృత్తుల్లో ఉపాధి పొందే వారికి రెయిన్ కోట్లు అందించడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో తణుకు సంస్థ అధ్యక్షుడు కడించర్ల రాజరాజేశ్వరరావు, చైర్మన్ కఠారి శారదాదేవి, విశిష్ట దాత, జిల్లా డెవలప్‌మెంట్ కమిటీ డైరెక్టర్ చిట్టూరి సుజాత, కార్యదర్శి కఠారి కాశీ విశ్వనాథరాజు, పూర్వపు అధ్యక్షుడు ఆలపాటి సుబ్బారావు, సత్తి రాజు, శ్రీకాకుళపు గోపాలకృష్ణ, శ్రీకాకుళం దీప్తి పాల్గొన్నారు.

### పోరాటాల చరిత్ర ఏపీయూడబ్ల్యూజేదే..


మాట్లాడుతున్న ఐజేయూ కార్యదర్శి

**తాడేపల్లిగూడెం:** జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలు చేసిన చరిత్ర ఏపీయూడబ్ల్యూజేదేనని ఐజేయు కార్యదర్శి డి.సోమసుందర్ అన్నారు. యూనియన్ 69వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం స్థానిక గాంధీ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సోమసుందర్ మాట్లాడుతూ విలేకరులకు అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డు, బస్‌పాస్ వంటి అన్ని సదుపాయాలు సాధించిన ఘనత యూనియన్‌ది అన్నారు. జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్న సంస్థ ఏపీయూడబ్ల్యూజే అని సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యడ్లపల్లి మురళీకృష్ణ అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గజపతి వరప్రసాద్, ఖాదర్ మొహిద్దీన్, గొలిమే బుజ్జిబాబు, పాలడుగు సతీష్, చిట్యాల రాంబాబు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

### కళాకారుల సభను జయప్రదం చేయండి

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** బీవీఆర్ కళా కేంద్రం కళాకారుల ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన శుక్రవారం స్థానిక డీఎస్ చెరువు వద్ద బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో నెలవారీ, సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహిస్తున్నట్లు విజయవంతం చేయాలని బీవీఆర్ వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు వెల్లడించారు. ఏవీఆర్ సుబ్రహ్మణ్యంనకు గౌరవ పురస్కారం, సయ్యద్ జమీల్ అహ్మద్‌కు కళా పురస్కారం, జి.నాగమణికి ఆర్థిక సత్కారం జరుగుతాయన్నారు.

**19న రంగస్థల కళాకారుల సంఘ సభ**

రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సమావేశం ఈ నెల 19వ తేదీన మంగళవారం నంది బొమ్మ సెంటర్, రామాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి షేక్ నాగూర్ సాహెబ్, చింతకాయ ల వంశీకృష్ణ వెల్లడించారు. సర్పంచి ముచ్చర్ల వేణుగోపాల మురళీకృష్ణకు గౌరవ అభినందన సత్కారం, వసంతాడ ఆనంద స్వరూప్‌కు ఉద్యోగ సేవారత్న పురస్కారం జరుగుతాయన్నారు.

# వర్షపు నీటితో ప్రజల ఇక్కట్లు


పెంటపాడు: ఎస్సీ పేటలోకి చొచ్చుకొచ్చిన వర్షపు నీరు


తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని డీఎస్ చెరువు కూడలిలో రోడ్డుపై నిలిచిన నీరు

- ఎస్సీ పేటల్లో రహదారులు మునక
- ముంపులోనే వరినాట్లు

**తాడేపల్లిగూడెం రూరల్:** గత రెండ్రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రోడ్లపై నీరు నిలుస్తోంది. దీంతో రహదారులు గోతులమయంగా మారుతున్నాయి. ప్రధానంగా మండలంలోని మెట్ట ఉప్పరగూడెం జగనన్న కాలనీ, కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీ, పెదతాడేపల్లి జగన్మోహనపురం, నవాబుపాలెం, మాధవరం, వెంకట్రావుపాలెం, కుంచనపల్లి, రామన్నగూడెం, మోదుగ గుంట, లింగారాయుడిగూడెం తదితర గ్రామాల రహదారులు ఛిద్రంగా మారుతున్నాయి. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితుల్లో ఆయా రహదారులు దర్శనమిస్తున్నాయి. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉండటంతో గ్రామీణ రహదారుల దుస్థితి అగమ్యగోచరంగా మారుతుంది. రోడ్లపై నిలుస్తున్న నీరు బయటకు పోయే మార్గాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**నీటమునిగిన వరిచేలు**

**పెంటపాడు:** గత నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో మండలంలో పలు గ్రామాలు జలమయమయ్యాయి. ఇటీవల పెంటపాడు, కె.పెంటపాడు, యానాలపల్లి, పరిమెల్ల గ్రామాల్లో వరి నాట్లు నీట మునిగాయి. ఇప్పటికే 5 రోజులు పూర్తవుతోంది. మరో రెండు రోజులు ఉంటే నారు కుళ్లిపోయే అవకాశం ఉంది. సమీపంలోని డ్రెయినేజీలు వర్షం నీరు లాగకపోవడం వలన ముంపు నీరు చేలల్లోనే ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే పెంటపాడు పోలీస్ స్టేషన్ వెనుక ఎస్సీ పేటలో పల్లపు ప్రాంతాల్లో రహదారులు నీట మునిగాయి. అక్కడ దోమలు విజృంభించాయి. తక్షణం నివారణ చర్యలు తీసుకోవాలని పేట వాసులు కోరుతున్నారు.

**ఎమ్మెల్యే పరిశీలన**

**పెంటపాడు:** మండలంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కూటమి నాయకులతో కలిసి పలు గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. నీట మునిగిన వరి నాట్లను పరిశీలించారు. పరిమెళ్ల, యానాలపల్లి, కె.పెంటపాడు, విప్పర్రు గ్రామాల్లో పర్యటించారు. నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి తెలిపారు.

# మాజీ మంత్రి కారుమూరి పరామర్శ


పులుపు శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

**ఇరగవరం:** మండలంలోని రేలంగి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ప్రముఖ వ్యాపారవేత్త పులుపు శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యానికి గురై గుండెకు స్టంట్లు వేయించుకున్నారు. దీంతో అనారోగ్య బాధితుడు పులుపు శ్రీనివాస్‌ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ, రీజనల్ కో–ఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ పులుపు శ్రీనివాస్ ను పరామర్శించి ఆరోగ్యం పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పులుపు శ్రీనివాస్ కుటుంబం వైఎస్సార్ సీపీకి విధేయతతో సేవలందించిందన్నారు. వారి కుటుంబ సభ్యులు పులుపు అక్కమాంబ, ఉప సర్పంచ్‌గా, పులుపు అనిల్, పులుపు సునీల్ ఇద్దరూ పార్టీలో చురుగ్గా పని చేస్తున్నారు. వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండ దండగా ఉంటుందన్నారు. వారికి ఎల్లప్పుడూ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, మాజీ డీసీఎం డైరెక్టర్ పెనెత్స సుబ్బరాజు, ఎంపీటీసీ మహాలక్ష్మి, వార్డు మెంబర్ వెంకట లక్ష్మి, పార్టీ గ్రామ అధ్యక్షుడు వడ్డే మార్కేండేయులు, మాజీ సర్పంచ్ మైనం పాము, తదితరులు పాల్గొన్నారు.

# 102 మందికి ఉచిత కంటి పరీక్షలు


ఉచిత నేత్ర వైద్య శిబిరం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక కడకట్ల జనతా ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఇన్‌చార్జి అధ్యక్షుడు చిన్నం జగదీష్ ఆధ్వర్యంలో పీఎంజేఎఫ్ పదం కుమార్ గుప్తా ఆర్థిక సహకారంతో ఆదివారం నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణ నేత్ర వైద్యశాల వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ సభ్యులు కె.నరసింహమూర్తి శిబిరాన్ని ప్రారంభించారు. 102 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. 22 మందికి కళ్లజోళ్లు అందించేందుకు నిర్ణయించారు. 23 మందిని పేషంట్లను, 22 మందిని ఆపరేషన్ల నిమిత్తం నిడదవోలు కంటి ఆసుపత్రికి తీసుకెళ్లారు. సుంకర శ్రీనివాస్, జగదీష్, కోశాధికారి గోగు కిరణ్‌కుమార్, ఆలపాటి పవన్ కుమార్, జీడిగుంట హరిబాబు, వి.రామ్మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల జీవనం అస్తవ్యస్తం


మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** స్త్రీశక్తి పథకం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు పథకం వలన ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ఆటోలు తిప్పుతున్న నిరుద్యోగులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, ఎంతో మంది ఉన్నత చదువులు చదువుకున్న వారు ఉన్నారని, గత 30 సంవత్సరాలుగా ఉద్యోగాలు, ఉపాధి అవకాశం లేక యువత ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, కుటుంబాలను పోషించే పరిస్థితి లేదని, బ్యాంకులు నుంచి రుణాలు తీసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఫ్రీ బస్సు కారణంగా ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి, రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని వాపోయారు. చంద్రబాబు ఎలక్షన్ ముందు ఆటో ఎక్కి, 3 లక్షల 70 వేల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, ఆటోకి టీడీపీ జెండా కట్టుకొని తిరగండి, మీకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, హామీ ఇచ్చి, ఇప్పుడు ఆటో డ్రైవర్ల వెన్ను విరిచారని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఆటో యూనియన్లకు సంఘీభావం తెలిపారు. నాయకురాలు పొట్ల విజయ కుమారి, నాయకులు రాజేష్, అచ్చిబాబు, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

## దంచికొట్టిన వర్షం

**భీమవరం అర్బన్:** బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, నాగిడిపాలెం, కొమరాడ, అనాకోడేరు, గొల్లవానితిప్ప, గూట్లపాడు, దొంగపిండి, రాయలం, చినఅమిరం, తుందుర్రు, వెంప, తాడేరు తదితర గ్రామాలలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా వర్షం పడింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత రెండు రోజులుగా వర్షం పడడంతో ఇప్పటికే పల్లపు గ్రామాలైనా నాగిడిపాలెం, దెయ్యాలతిప్ప, తోకతిప్ప తదితర గ్రామాలలో శివారు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం పడడంతో వరినాట్లుకు కూలీలు రావడం లేదని రైతులు చెబుతున్నారు.

**ఆకివీడులో..**

**ఆకివీడు:** మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తూనే ఉంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. ఎగువ నుంచి వస్తున్న ముంపునీటితో పల్లపు ప్రాంతాలు మరింత ముంపునకు గురవుతున్నాయి.

# సీపీఐ జనసేవా దళ్ వలంటీర్ల సేవలు అభినందనీయం


సీపీఐ జనసేవా దళ్ వలంటీర్ల కవాతులో పాల్గొన్న భీమారావు తదితరులు

**తణుకు అర్బన్:** ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భాల్లో బాధితులకు సేవా కార్యక్రమాలు అందించడంలో సీపీఐ జనసేవాదళ్ వలంటీర్లు చేస్తున్న కృషి అభినందనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో తణుకులో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహా సభలు, 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహా సభల సందర్భంగా జరిగే ప్రజా ప్రదర్శనల్లో రెడ్ షర్ట్ వలంటీర్ల కవాతులో పాల్గొనే జనసేవాదళ్ వలంటీర్ల శిక్షణా శిబిరాన్ని ఆదివారం తణుకు సిల్వర్ జూబ్లీ పార్క్ వద్ద భీమారావు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, నేతలు సికిలే పుష్పకుమారి, చిక్కాల దుర్గా ప్రసాద్, దేవ పెద్దిరాజు, దాకే మసలయ్య, శ్యామ్‌బాబు, ఇసుకపల్లి రమేష్ ఏకే గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగని ప్లాస్టిక్ వాడకం


అయిభీమవరం టర్నింగ్ వద్ద డ్రెయిన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్, సింగిల్ యూజ్ వ్యర్థాలు

**ఆకివీడు:** ప్లాస్టిక్ వినియోగం భారీగా పెరిగింది. ప్లాస్టిక్ వినియోగం వద్దు అంటూ ప్రభుత్వం, అధికారులు విస్తృత ప్రచారం చేసినప్పటికీ ప్రజల్లో వినియోగం మరింతగా పెరిగింది. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్డు మార్జిన్లు, డ్రెయిన్లు, పంట, మురుగు కాలువల్లో పేరుకుపోతున్నాయి. ఖాళీ ప్రదేశాల్లో తిష్టవేస్తున్నా యి. ప్లాస్టిక్ వినియోగాన్ని అంతమొందించాలని అధికారులు తాటాకు చప్పుళ్లు చేసి చేతులు దులుపుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కూరగాయల దుకాణాల్లో, పండ్లు, వ్యాపారాల్లోనూ, కిరాణా, బడ్డీ కొట్లు, బిర్యానీ సెంటర్లు, కాఫీ హోటళ్లలో ప్లాస్టిక్ వినియోగం అధికంగా ఉంది. నగర పంచాయతీ అధికారులకు కోపం వచ్చినప్పుడల్లా కూరగాయల దుకాణాలపై పడి ప్లాస్టిక్ కవర్లు పట్టుకు పోతున్నారు. ఫైన్లు వేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్లలో టీ అమ్ముతున్నారంటే ప్లాస్టిక్ వినియోగం ఎంతగా ఉందో అర్థమవుతోంది. ప్లాస్టిక్ గ్లాసులు, బాటిళ్ల అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతోన్నాయి. వాటి వినియోగం, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

## మావుళ్లమ్మ జాతర ప్రారంభం

**భీమవరం(ప్రకాశంచౌక్):** భీమవరం రెస్ట్ హౌస్ రోడ్డులోని రామాలయం వద్ద శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 66వ జాతర మహోత్సవాలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. వాడవాడలా శ్రీమావుళ్లమ్మ అమ్మవారి జాతరలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం శుభపరిణామన్నారు. అనంతరం అమ్మవారి జాతరను కమిటీ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం మాజీ అధ్యక్షులు కొండ్రు శ్రీనివాస్, అయితం నరసింహ మూర్తి, కొర్ర రంగారావు, జి.శివరామ్, దువ్వి అప్పన్న, కిలారి కృష్ణప్రసాద్, గొలగని చంద్రరావు, కోరాడ శ్రీను, బర్ల శివ, గంటా బాబీ, గొలగని రమేష్ పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి

**వీరవాసరం:** గ్రామంలో ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని సీపీఎం గ్రామ శాఖ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో బాలం విజయకుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ బొర్రా అలమహారాజు మాట్లాడుతూ మండల కేంద్రమైన వీరవాసరంలో అనేక సమస్యలు ఉన్నాయని మేజర్ సమస్యగా ఇళ్ల స్థలాల సమస్య ఉందన్నారు. అభివృద్ధిని గురించి గొప్పగా మాట్లాడుతున్న పాలకులు కనీసం ఇళ్ల స్థలాలు, తాగునీరు, రోడ్లు వేయలేని స్థితిలో ఉన్నారని అన్నారు. సూపర్ సిక్స్ అంటూ స్థానిక సమస్యలను గాలికి వదిలేస్తున్నారని అన్నారు. ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించకపోతే త్వరలోనే ఉద్యమం చేపటడతామని ఈ సందర్భంగా సీపీఎం నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.ఆంజనేయులు, రెడ్డి రాము, ఎండమూరు సుబ్బారావు, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, శ్యాం తదితరులు పాల్గొన్నారు.